# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-02-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వ్యాధి పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు ఆదేశించారు.**
2. **రాష్ట్ర ప్రభుత్వం వాట్స్‌ప్ ద్వారా మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చింది.**
3. **శాసన సభ కార్యకలాపాల పట్ల ఈ నెల 22, 23 తేదీలలో శాసన సభ్యులకు అవగాహనా కార్యక్రమం జరగనున్నది.**
4. **ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ విజయవాడలో కేంద్ర ప్రభుత్వోద్యోగులు 5క్ రన్ నిర్వహించారు.**
5. **ఆర్య సమాజ్ వ్యవస్థాపకులు స్వామీ దయానంద సరస్వతి జయంతి ఈ రోజు**
6. **మాఘ పౌర్ణమి పర్వదినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో ఈ రోజు జరుపుకుంటున్నారు**

==========================

రాష్ట్రంలో కోళ్ళకు సోకుతున్న బర్డ్ ఫ్లూ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాల అధికారులతో ఆయన ఈరోజు దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని, అన్ని కోళ్ళ ఫారాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. చనిపోయిన కోళ్లను పరిశీలించి నమూనాలను ప్రయోగశాలలకు పంపాలని ఆదేశించారు. జిల్లాల సరిహద్దుల వద్ద కూడా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

--------------------------

బర్డ్ ఫ్లూ కారణంగా కోళ్ళు మృత్యు వాత పడుతుండడంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలకు కోడి గుడ్ల సరఫరా నిలిపివేయాలని జిల్లాకలెక్టర్ ఆర్. మహేష్ అధికారులను ఆదేశించారు. అమలాపురం కలెక్టర్ కార్యాలయం నుండి ఈ అంశంపై తహశీల్దార్లు ..., మున్సిపల్ కమిషనర్‌లు ...., మండల స్థాయి అధికారులతో దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ మండలాలలోని కోళ్ల ఫారాలలో 57 లక్షలకు పైగా కోళ్ళు ఉన్నాయని, అయితే.. ఇప్పటి వరకు జిల్లాలో బర్డ్ ఫ్లూ ను ఎక్కడా గుర్తించలేదని, అయినప్పటికీ ..., ఈ

విషయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు.

---------------------------

తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారంలో కోళ్ళకు వైరస్ సోకిందని నిర్ధారణ అయినందున జిల్లా వ్యాప్తంగా సంబంధిత అధికారులను అప్రమత్తం చేశామని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. మరిన్ని వివరాలను మా ఆకాశవాణి ప్రతినిధి కె.వి.వి.సత్యనారాయణ తెలియజేస్తూ....

..వాయిస్.. 35 సెకన్లు

కాగా.. బర్డ్ ఫ్లూ వ్యాధిపై పశ్చిమ గోదావరి జిల్లా ఆకాశవాణి ప్రతినిధి ఐ. సుబ్బారావు ఈ విధంగా తెలియజేశారు.

.వాయిస్.. 27 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ప్రజలకు సౌలభ్యంగా ఉండే విధంగా వాట్స్‌ప్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు మరిన్ని కొత్త సేవలను ప్రారంభించింది. కాకినాడ సమీపంలోని అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో వ్రతాలు...,. దర్శన టికెట్లను అందుబాటులోకి తీసుకు వచ్చింది. 95523 00009 అనే నంబర్‌కు హాయ్ అని సందేశం పంపితే.... ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా టికెట్లు ఇవ్వనున్నది. శ్రీశైలం ..., సింహాచలం...,.ద్వారకా తిరుమల ...., కాణిపాకం వంటి క్షేత్రాలలో ఈ సేవలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయి.

---------------------------

శాసన సభ్యులకు ఈ నెల 22, 23 తేదీలలో ప్రత్యేక అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్టు ప్రభుత్వ చీఫ్ విప్ జి. వి. ఆంజనేయులు తెలిపారు. అమరావతిలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ .... 22వ తేదీన జరిగే ప్రారంభ కార్యక్రమంలో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా ...., రెండవ రోజు కార్యక్రమంలో పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పాల్గొంటారని తెలిపారు. శాసన సభకు తొలిసారి ఎన్నికైన సభ్యులే ఎక్కువగా ఉన్నందున వారికి శాసన సభ ..., బడ్జెట్ వ్యవహారాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. రెండు రోజుల పాటు ఉదయం నుండి సాయంత్రం వరకు జరిగే ఈ సదస్సులో శాసన సభ్యులకు అసెంబ్లీ ..., పార్లమెంటు వ్యవహారాలపై నిపుణులు అవగాహన కల్పిస్తారని...., కొత్తగా ఎన్నికైన సభ్యులతో పాటు సీనియర్ సభ్యులు కూడా ఈ సదస్సులో పాల్గొంటారని ఆంజనేయులు వివరించారు.

---------------------------

మెరుగైన ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో నడక ...,.పరుగును భాగం చేసుకోవాలని కస్టమ్స్ శాఖ కమిషనర్ కమిషనర్ సాధు నరసింహా రెడ్డి సూచించారు. అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం సందర్భంగా విజయవాడ రీజన్ పాస్ పోర్టు కార్యాలయం ఉద్యోగులతో కలిసి ఈరోజు ఉదయం ఆయన ఫిట్ ఇండియా 5కె పరుగును ప్రారంభించారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో పాస్ పోర్ట్ కార్యాలయం అధికారులు ..., ఇతర శాఖల కేంద్ర ప్రభుత్వోద్యోగులు పాల్గొన్నారు.

అనంతరం ... సాధు నరసింహా రెడ్డి మాట్లాడుతూ ....

వాయిస్ ..35 సెకన్లు

రీజనల్ పాస్ పోర్టు అధికారి శివ హర్ష మాట్లాడుతూ .... రాజ్యాంగ ప్రాశస్త్యానికి ప్రచారం కల్పించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశమని పేర్కొంటూ ....

... వాయిస్ ... 37 సెకన్లు

---------------------------

ఆర్య సమాజ్ వ్యవస్థాపకులు స్వామీ దయానంద సరస్వతి జయంతి ఈ రోజు. అజ్ఞానాంధకారం, దారిద్ర్యం, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన 1824వ సంవత్సరం ఫిబ్రవరి 12వ తేదీన గుజరాత్ రాష్ట్రంలోని టంకార గ్రామంలో జన్మించారు. 1857 ప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించి... ఎందరో స్వాతంత్ర్య సమర యోధులకు ప్రేరణగా నిలిచారు. ధర్మ సంస్థాపన కోసం అవిరళ కృషి చేసిన స్వామీ దయానంద సరస్వతి 1883 అక్టోబర్ 30వ తేదీన తుది శ్వాస విడిచారు.

---------------------------

ఈ రోజు మాఘ పౌర్ణమి పర్వదినాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా విశాఖపట్నం..., భీమిలి ..., మచిలీపట్నం ... తదితర సముద్ర తీరాలలో ప్రజలు పుణ్య స్నానాలు చేస్తున్నారు. మాఘ పౌర్ణమినే మహా మాఘి అని కూడా పిలుస్తారు. మాఘ పౌర్ణమి రోజు సముద్ర స్నానం వల్ల చక్కని ఆరోగ్యం ప్రాప్తిస్తుందని ప్రజల విశ్వాసం. అంతేకాకుండా ... మాఘ పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకుని ప్రజలు ఈ రోజున సూర్యారాధన ..., వైష్ణవ .., శైవ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

ఇలా ఉండగా ... రాష్ట్ర వ్యాప్తంగా కృష్ణా ..., గోదావరి ....తుంగభద్ర నదీ తీరాలలో కూడా భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు.

---------------------------

మాఘ పౌర్ణమి సందర్భంగా ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ రాజ్ వద్ద త్రివేణి సంగమ ప్రాంతంలో ఈరోజు లక్షలాది మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. యాత్రికుల రద్దీ అధికం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.

మరొక వైపు ... కాశీ ..., అయోధ్య ...., ఉజ్జయిని తీర్థాల వద్ద కూడా పెద్ద సంఖ్యలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు.

---------------------------

మానవ పరిణామ క్రమాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ప్రముఖ శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్ జయంతి ఈ రోజు. 1809వ సంవత్సరం ఫిబ్రవరి 12వ తేదీన ఇంగ్లాండులో జన్మించిన ఆయన .... మానవాళి పరిణామ క్రమం ఏ విధంగా జరిగిందో తెలియజెప్పి కోతుల నుండి మానవుడు రూపాంతరం చెందాడని ప్రపంచానికి చాటారు. ప్రాంతాలు ..., వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల కోతులలో వచ్చిన మార్పులే మానవునిగా నిలబెట్టాయని చార్లెస్ డార్విన్ తన ఆవిష్కరణలో పేర్కొన్నారు. 1882వ సంవత్సరం ఏప్రిల్ 19వ తేదీన ఆయన తుది శ్వాస విడిచారు.

=====================